క్లుప్తంగా

తలశిలకు కైలే జన్మదిన శుభాకాంక్షలు



పామర్రు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు తలశిల రఘురాంను కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో రఘురాంను కలిసిన కైలే పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని మంటాడ గ్రామంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. చౌటపల్లి ఫీడర్ పరిధిలో సైతం అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఇందుకు ఆయా గ్రామాల గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకుమార్ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్యానల్ లాయర్లు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, న్యాయవాది వెంకటప్పయ్య, హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం

పామర్రు: స్థానిక శ్రీ అంకమ్మతల్లి దేవస్థానంలోని రేణుకా పరమేశ్వరునికి గురువారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అన్నాభిషేకం చేశారు. తొలుత స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ఆవుపాలతో స్నపన, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో స్వామికి విశేషంగా అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వెన్నా శ్రీనివాసరావు, వాణిశ్రీ దంపతుల సౌజన్యంతో స్వామికి అన్నాభిషేకం చేసి హోమాలను జరిపించారు. అన్నాభిషేకం జరిగిన అన్నంతో భక్తులందరికీ అన్న సమారాధన నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు తెలిపారు.

30న జాబ్ మేళా

కైకలూరు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కైకలూరు జూనియర్ కాలేజీలో ఈ నెల 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. ఇందులో మెడ్ ప్లస్ హెల్త్ సర్వీసెస్, అరబిందో ఫార్మసీ, క్రిష్ ఫైనాన్స్, ఏటీఎం, రిలయన్స్ రిటైల్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో టైర్స్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్ ఇండియా, మోహన్ స్పిన్‌టెక్స్, బజాజ్ కేపిటల్ వంటి ప్రముఖ కంపెనీల్లో 705 మందికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, డీబీఎం ఫార్మసీ, ఎంబీఏ, పీజీ, బీటెక్ విద్యార్హతలతో 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 6281119575, 9676140314, 9988853335 టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి ఆచూకీ లభ్యం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు చెందిన దేవరపల్లి జయలక్ష్మి(35) తన పిల్లలతో కలిసి ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె భర్త దేవరపల్లి రాజు ఫిర్యాదుమేరకు గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. మీడియాలో వచ్చిన సమాచారంతో పల్నాడు జిల్లా చిలకలూరిపేట నుంచి స్థానికుల సమాచారం ఇవ్వడంతో కథ సుఖాంతమైంది. జయలక్ష్మితో పాటు పిల్లలు ప్రణవి(9), విద్యశ్రీ(7), వందన(6)ల ఆచూకీ చిలకలూరిపేటలో తమ పోలీసులకు లభ్యమైందని గురువారం ఎస్.ఐ సత్యనారాయణ తెలిపారు. ముగ్గురు పిల్లలతో పాటు జయలక్ష్మిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు.

హౌసింగ్ డీఈఈగా రమేష్‌బాబు

గుడివాడరూరల్: గుడివాడ సబ్ డివిజన్ హౌసింగ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వి.రమేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహానికి వెళ్లి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

- విషసర్పాలు, దోమలకు ఆవాసాలుగా మారిన వైనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



జెడ్పీ అతిథి గృహం పక్కన విషసర్పాలకు ఆవాసంగా మారిన పాడుబడ్డ భవనం



వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డు పక్కన అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం

గుడివాడరూరల్: ఏళ్ల తరబడి నివాసాలు లేక ఖాళీగా ఉంటున్న స్థలాలు అడవులను తలపిస్తున్నాయి. పెద్ద చెట్లు, ముళ్ల కంచెలు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి దర్శనమిస్తున్నాయి. విషసర్పాలు, వ్యాధులను కలిగించే దోమలు, పందులు ఖాళీ స్థలాల్లో తిష్టవేసి ఉండటంతో వాటి వలన ఏ ప్రమాదం కలుగుతుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలోని జగన్నాథపురం, బైపాస్‌రోడ్డు, రాజేంద్రనగర్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా ఖాళీ స్థలాలే కన్పిస్తాయి. ఆ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేయకపోవడంతో దశాబ్దాల కాలంగా ఖాళీగా ఉంటున్నాయి. దీంతో ఆ స్థలాలన్నీ పెద్ద పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో నిండిపోయాయి. ముఖ్యంగా ప్రభుత్వ జెడ్పీ అతిథి గృహం ఆనుకుని, పాటిమీద వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో మరో మూడు స్థలాలు ఇదే మాదిరిగా ఉన్నాయి. సత్యనారాయణపురం, భాస్కర్ థియేటర్ వెనుక తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది.

విషసర్పాలు, దోమలు, పందులకు ఆవాసాలుగా...

ఖాళీ స్థలాలు చిట్టడవులుగా మారడంతో ఆ ప్రాంతాలన్నీ విషసర్పాలు, దోమలు, పందులకు ఆవాసాలుగా మారాయి. ముఖ్యంగా పాటిమీద వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే ఈ రోడ్డుపై ప్రమాదకర విషసర్పాలు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో చీకటి పడితే అటువైపుగా వెళ్లేందుకు ప్రజలు భయాందోళనకు గురవ్వాల్సిన పరిస్థితి తలెత్తింది.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు...

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, పొదలు పెరగకుండా ఎప్పటికప్పుడు స్థల యజమానులు వాటిని శుభ్రం చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలి. నిబంధనలు పాటించని స్థలాలను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ అధికారులు ఖాళీ స్థలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఆ స్థలాలు చిట్టడవులుగా మారి పరిసర ప్రాంత ప్రజలకు సంకటంగా మారాయి. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం రావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఈ విషయంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరచి సంబంధిత ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి స్థలాలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులిస్తున్నాం

ఈ విషయమై గుడివాడ మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మనోహర్‌ను వివరణ కోరగా పట్టణ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాల యజమానుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. సేకరించిన వారికి ఇప్పటికే స్థలాల్లో ఉన్న చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించాల్సిందిగా నోటీసులు జారీ చేశాం. కొంతమంది యజమానుల వివరాలు తెలియలేదని, వారి గురించి విచారణ చేస్తున్నామని, తెలిసిన వెంటనే వారికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయనివారికి అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు.

శుభ్రం చేయించి పుణ్యం కట్టుకోండి



ఖాళీ స్థలాలు చిట్టడవులుగా మారాయి. దీనివలన మేము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రమాదకర సర్పాలు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. తక్షణమే ఖాళీ స్థలాలను శుభ్రం చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కె.ఫణికుమార్, జగన్నాథపురం

వ్యాధుల బారిన పడతాం



ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు దట్టంగా అల్లుకుపోవడం వలన దోమలు విజృంభిస్తున్నాయి. పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

–పండు, జగన్నాథపురం

నాసిరకంగా విద్యుత్ టవర్ నిర్మాణం



గుడివాడరూరల్: నందివాడ మండలం జనార్దనపురంలో ఓ రైతుకు సంబంధించిన పొలంలో ట్రాన్స్‌కో అధికారులు నాసిరకంగా విద్యుత్ టవర్ నిర్మిస్తున్నారని గ్రామస్తులు, రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన మలిరెడ్డి నాగభూషణం రెడ్డికి సంబంధించిన పొలంలో ఇటీవల విద్యుత్ టవర్ నిర్మాణ పనులు చేపట్టారు. ఓ బడా ప్రైవేట్ నిర్మాణ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తూతూ మంత్రంగా పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారని, నాసిరకం మెటీరియల్‌తో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాల వలన కాంక్రీట్ కృంగి భవిష్యత్‌లో టవర్ కూలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన తమను పక్కకు నెట్టివేసి నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పైగా నిర్మాణం చేస్తున్న పొలం యజమాని అనుమతి కూడా తీసుకోలేదని, ఈ విషయమై పొలం యజమానికి కోర్టును ఆశ్రయించారని చెప్పారు. నాసిరకం టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు నిర్వహించేలా చర్యలు

జనార్దనపురంలో జరిగే విద్యుత్ టవర్ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా చర్యలు చేపడతాం. ఇప్పటికే ఈ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే చర్యలు తీసుకుంటాం.

–జయకర్‌రాయ్, ట్రాన్స్‌కో ఈఈ

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం



గుడ్లవల్లేరు వైఎంస్సార్ బ్రిడ్జిపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



పామర్రులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



మొవ్వలో మానవ హారంగా ఏర్పడిన విద్యార్థులు



తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కైకలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, విద్యార్థులు



పెదపారుపూడి మానవహారంలో అధికారులు, విద్యార్థులు

మాదక ద్రవ్యాలతో జీవితం పతనం

గుడ్లవల్లేరు: మాదక ద్రవ్యాలతో జీవితం పతనం అవుతుందని గుడివాడ సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు అన్నారు. గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. పాలిటెక్నిక్ కాలేజీలో ప్రపంచ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో భారీ ఎత్తున ర్యాలీ, మానవ హారాన్ని నిర్వహించారు. ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. హైస్కూల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ.వాణి అవగాహన సదస్సు నిర్వహించారు.. కార్యక్రమంలో ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, తహసీల్దార్ బి.లోకరాజు, ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో...

పామర్రు: ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నుంచి మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పామర్రు తహసీల్దార్ జి.రవికాంత్, పామర్రు సీఐ సుభాకర్, ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ, సూపర్‌వైజర్ విజయకుమారి, ఐకేపీ ఏపీఎం తిరుపతయ్య, పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

మొవ్వలో...

మొవ్వ: కూచిపూడి పోలీస్ స్టేషన్, మొవ్వ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, మొవ్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్), క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల నుంచి అధికారులు, విద్యార్థులు భారీ ఊరేగింపుగా మొవ్వ ప్రధాన జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.మస్తాన్, జూనియర్ కాలేజీ ప్రధానాచార్యులు డి.సత్యనారాయణ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎస్.ప్రసన్న విశ్వనాథ్, కూచిపూడి ఎస్ఐ కేఎస్ విశ్వనాథ్, ఎక్సైజ్ సీఐ బి.వి రాజు, ఎస్ఐ లక్ష్మీకాంతం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుణ్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో...

తోట్లవల్లూరు: సమాజం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం మండల కేంద్రమైన తోట్లవల్లూరులో గురువారం సాయంత్రం జరిగింది. అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించటంతో పాటు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ, జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎంపీడీఓ రవికాంత్, ఎంఈఓలు వెంకటేశ్వరరావు, సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

ముదినేపల్లిరూరల్: యువత, విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దని ఎస్ఐ ఎస్.వీరభద్రరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక విజయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, ఇతర కళాశాలల విద్యార్థులు ముదినేపల్లిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, ఇతర కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, సాధన రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో...

పెదపారుపూడి: యువత మత్తు పదార్థాలు విడనాడకపోతే జీవితం నాశనం అవుతుందని తహసీల్దార్ శ్రీనునాయక్ అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలో గురువారం సాయంత్రం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విమాదేవి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

కైకలూరు: మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కైకలూరు రూరల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ తెలిపారు. ప్రపంచ మత్తు పదార్థాల నివారణ దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖ కైకలూరులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించింది. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీ విద్యార్థులు తాలూకా సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, ఐసీడీఎస్ సీడీపీవో డాక్టర్ ఎస్.దీప్తి మత్తు పదార్థాల వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు.

గుడివాడలో...

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ పి.నాగరాజు సూచించారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్, మత్తు పదార్థాలు, కాలేమనీ తదితర అంశాలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రత్నరాజు, ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐనపూరులో...

పమిడిముక్కల: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐనపూరు హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్

గుడివాడటౌన్: మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం యువత వల్లే సాధ్యమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్ అన్నారు. స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, న్యాయవాదులు రఫీ, బాలకృష్ణ, విమలాదేవి లీగల్ సెల్ వలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్ కళాశాలలో...

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏఎన్‌ఆర్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ...

మాదకద్రవ్యాలు విడనాడాలని కోరుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు తహసీల్దార్ టీవీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎ.విజయ ఫ్లోరెన్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

పెద్దింట్లమ్మ దేవాలయ హుండీ ఆదాయం రూ.14,92,289

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన 90 రోజుల కానుకల హుండీలను గురువారం లెక్కించారు. మొత్తం రూ.14,92,289 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ చెప్పారు. పర్యవేక్షణ అధికారిగా గుడివాడ దేవదాయశాఖ తనిఖీ అధికారి సుధాకర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్ల మరమ్మతు పనుల పరిశీలన

కైకలూరు: వర్షాల నేపథ్యంలో డ్రెయిన్ల నీరు సాఫీగా దిగువకు చేరడానికి మరమ్మతు పనులను శరవేగంగా చేయిస్తున్నామని డ్రెయినేజీ శాఖ గుడివాడ డివిజన్ ఈఈ కిరణ్‌బాబు చెప్పారు. కైకలూరు పట్టణంలో వర్లకోడు, గోపవరంలో పుల్లవ డ్రెయిన్, వరహాపట్నం శివారు పెదకొమ్ములేరు డ్రెయిన్ల పనులతో పాటు, పల్లవ డ్రెయిన్ వద్ద నేషనల్ హైవే పనుల తీరును గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక డ్రెయినేజీ డీఈ శిరీష పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా డ్రెయిన్ బాగుజేత

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు డ్రెయిన్‌ను రైతులు గురువారం స్వచ్ఛందంగా బాగు చేసుకున్నారు. ఈ డ్రెయిన్ పూడుకుపోవడంతో సక్రమంగా నీరు ప్రవహించక రైతులు అవస్థలు పడుతున్నారు. దీనిని గుర్తించిన స్థానిక నాయకులు దావు నాగరాజు, యార్లగడ్డ గంగయ్య, మరి కొందరు రైతుల ఆర్థిక సాయంతో పొక్లయినర్‌ను ఏర్పాటు చేసుకుని డ్రెయిన్‌ను బాగు చేశారు.

యలమర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఐ పల్లెనిద్ర

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మైనర్ బాలికలు, మహిళలపై జరిగే అత్యాచారాలు నివారించడానికి తగిన సూచనలు చేశారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

కైకలూరు: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటన భుజబలపట్నం గ్రామంలో గురువారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుత్తుల వీరాంజనేయులు(43) చేపల పిల్లల సరఫరా వ్యాన్‌పై ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కమతం రవికుమార్ వీరాంజనేయుల వద్ద పని చేసేవాడు. విభేదాల కారణంగా రవికుమార్ పని మానేశాడు. ఇటీవల తన గురించి మరొకరి వద్ద చెడుగా మాట్లాడుతున్నాడ వీరాంజనేయులుకు ఫోన్ చేసి బెదిరించాడు. ఈ నేపథ్యంలో గురువారం వీరాంజనేయులుపై రవి కుమార్ దాడి చేశాడు.

నట్టల నివారణ మందు పంపిణీ

మొవ్వ: మొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం 200 గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందు తాగించినట్టు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎంఎస్ఏ దివాకర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు చిన్నారావు పాల్గొన్నారు.